క్లుప్తంగా

నేడు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు స్థానిక పారిశ్రామికవాడలోని సీనియర్ సిటిజన్ ఫోరం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఎ.రాజసింహుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సకల జనుల సమ్మె పోలీసు కేసులు, ఇతర సమస్యలపై చర్చించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

టీచర్లపై పెత్తనం కోసమే కాంపెక్స్ స్కూళ్ల ఎంపిక

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉపాధ్యాయులపై పెత్తనం చేయడానికే సస్పెండ్ అయిన గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కాంప్లెక్స్ స్కూళ్లను ఎంపిక చేసుకున్నారని, వారికి అధికారులు పూర్తిగా సహకరించినట్లు ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షులు షేక్ ఫారుఖ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వంలో వారి అక్రమాలు బయటపడ్డాయని పేర్కొన్నారు. సస్పెండ్ అయిన జీహెచ్‌ఎంలకు పాతపాఠశాలలు కాకుండా, వేరే పాఠశాలలు కేటాయించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

నేడు ఎమ్మెల్యే రాక

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బుధవారం వస్తున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినికిడి లోపం, అంధులకు, శారీరక మానసిక దివ్యాంగులకు ట్రై సైకిళ్లు, ఇతర పరికరాల కోసం అర్హులైన వారిని ఎంపిక చేస్తారని తెలిపారు. మండల నాయకులు, అనుబంధ సంస్థల నాయకులు, గ్రామ నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై విచారించండి

జడ్చర్ల: నియోజకవర్గంలోని ఊర్కొండ మండలంలోని ఊర్కొండపేట సర్వే నంబర్ 233లో ప్రభుత్వ భూమిలో ఇళ్ల నిర్మాణంపై పూర్తి స్థాయిలో విచారించి నిజనిజాలు తెలుపాలని తహసీల్దార్‌ను ఆదేశించినట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1.06 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇళ్ల నిర్మాణం చేపట్టి నోటరీ, బాండ్ల రూపంలో రాసుకుని విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. ఇదే భూమిలో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకు ఉందని, బీసీ హాస్టల్‌కు వెళ్లే రహదారిని కూడా కబ్జా చేశారని తెలిపారు. దీనిపై సమగ్ర విచారణ చేయాలని పేర్కొన్నారు.

పురోగతిలో సిగరెట్ల అపహరణ కేసు

జడ్చర్ల: జడ్చర్లలోని శ్రీరాంనగర్‌లో ఐటీసీ గోదాంలో ఈనెల 20న సుమారు రూ.32 లక్షల సిగరెట్ కాటన్ల అపహరణ కేసు దర్యాప్తు చురుగ్గా సాగుతోంది. ఇప్పటికే సిగరెట్ కాటన్లను తరలించిన వాహనం జాడ గుర్తించినట్లుగా సమాచారం. వాహనంలో ఉన్న కాటన్లను ఎక్కడో గుట్టుగా తరలించి ఖాళీ వాహనం కర్ణాటక రాష్ట్రానికి తరలించారు. నిందితులు రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన వారై ఉంటారని అనుమానిస్తున్నారు.

రేపు కేయూలో ఎంఎస్‌ఎఫ్ సదస్సు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 24న ఎంఎస్‌ఎఫ్ రాష్ట్ర సదస్సు కాకతీయ యూనివర్సిటీలో నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జీ బుక్కాపురం మహేష్ పేర్కొన్నారు. ఈ మేరకు పీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణపై ఇచ్చిన హామీని నిలబెట్టుకుని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పును అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇటువంటి సమస్యలు చర్చించేందుకు నిర్వహించే సదస్సులో పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాజరుకావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గణేష్, శ్రీను, మమత, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ టోల్‌ప్లాజా దగ్గర మంగళవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో బైరంపల్లి గ్రామానికి చెందిన పోల్ శేఖర్ పోలీసుల విధులకు ఆటంకం కల్గించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

చిన్నరాజమూర్ అంజన్నకు ఘనంగా పూజలు

దేవరకద్ర: ప్రసిద్ధి చెందిన చిన్నరాజమూర్ ఆంజనేయస్వామికి మంగళవారం ఘనంగా పూజలు నిర్వహించారు. బహుళ పంచమి మంగళవారం పురస్కరించుకుని స్వామి మూలవిరాట్‌కు పాలాభిషేకం, పూజలు చేశారు.

బంతిసాగు.. భలే బాగు

- వంద ఎకరాల్లో పూలతోటలు
- ఒక్క వెంకటేశ్వర తండాలోనే 31 ఎకరాల్లో సాగు
- పండుగల వేళ రైతులకు లాభాలు



నవాబుపేట వెంకటేశ్వర తండాలో బంతి పూల సాగుతో కల కలలాడుతున్న పంట పొలాలు

నవాబుపేట: భూమికి పచ్చని రంగేసినట్లు గిరిజన తండాల పొలాలు కనువిందు చేస్తున్నాయి. చూడగానే 'అబ్బ పూలతోటలు బలే బాగు' అనుకునేలా నేల మొత్తం రంగులతో నింపినట్లు కనిపిస్తోంది. మండలం లోని వెంకటేశ్వరతండా, సత్రోనిపల్లి, దేపల్లి, కోమటికుంటతండా, చౌడూర్‌లలో గిరిజనులు బంతి పూల సాగులో ముందున్నారు. గతంలో తండాలో పూజలకు బంతి పూల కోసం హైదరాబాద్ వెళ్లితే పూల ధరలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వందల్లో ధర పలికింది. దీంతో ఇబ్బందులు పడి తండా వాసులు పూల సాగుకు సిద్ధమయ్యారు. దీంతో ఆరేళ్ల క్రితం మొదట ఆర ఎకరంతో ప్రారంభమైన పంట నేడు 31 ఎకరాలకు పైగానే ఒకే తండాలో సాగు చేస్తుండడం విశేషం. ఇలా అన్ని తండాల్లో కలిసి దాదాపుగా వంద ఎకరాల వరకు బంతి పూలసాగుకు చేరింది. ఈ పంటలకు పెట్టుబడి సైతం పెద్దగా వస్తున్న దానికి సరిపోను ధర రావటంతో గిరిజనులు పూలసాగుపై దృష్టి పెట్టారు. పొలం ఉన్న ప్రతి గిరిజన రైతు ఆర ఎకరాకు తగ్గకుండా పూలసాగు చేయటం తండా ప్రత్యేకత. మండలంలో ఎవరికి పూలు కావాలన్నా వెంకటేశ్వరతండాకు రావాల్సిందే. తండా వాసులు ఎక్కువగా పూలను శంషాబాద్ మార్కెట్, హైదరాబాద్ మార్కెట్లకు తరలిస్తుంటారు. ఒక్కో సీజన్‌లో రైతులు పూలతోటలతో ఎకరం బంతి పూల తోటలకు పెట్టుబడి మినహాయించి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు లాభాలు పొందినట్లు గిరిజనులు పేర్కొన్నారు. ఈ తండాను ఆదర్శంగా తీసుకుని సత్రోనిపల్లి, దేపల్లి, చౌడూర్ గిరిజన తండాల్లో సైతం పూలసాగు మొదలైంది.

ఎకరాకి 10 క్వింటాళ్ల దిగుబడి



బంతిసాగు ఎకరాకు పది క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ధర ఎక్కువ తక్కువ అయినా చివర్లో దీపావళి సీజన్లో కలిసి వస్తుంది. నష్టం వచ్చే సమస్య లేకపోయినా ఇబ్బందులు చాలా ఉన్నాయి. విత్తనం తీసుకోవటమే చాలా ఇబ్బంది. బాగా తెలిసిన వాళ్లతోనే విత్తనం పొందాలి లేకుంటే పెట్టుబడి, శ్రమ రెండు వృథా అవుతాయి. ప్రభుత్వం చేయూతనిస్తే మరింత సాగు చేయవచ్చు. ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి వస్తుంది. దీనికి ప్రభుత్వం చేయూతనిస్తే మరింత సాగు చేయవచ్చు. ప్రధానంగా పూల విత్తనం ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకుంటే భరోసా ఉంటుంది.

– లింబ్యానాయక్, వెంకటేశ్వరతండా, నవాబుపేట

ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలి

ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



పాత మొల్గరలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: రైతుల నుంచి ధాన్యం సేకరణ పకడ్బందీగా చేపట్టాలని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం భూత్పూర్ మండలంలోని మద్దిగట్ల, పాత మొల్గర, భూత్పూర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. మద్దిగట్లలోని మద్దిఖాన్ చెరువులో ఎమ్మెల్యే చేప పిల్లలు వదిలారు. పాత మొల్గరలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. అనంతరం భూత్పూర్ తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ 15 రోజుల ముందుగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల హామీలో భాగంగా ఈ సీజన్ నుంచే సన్న రకం ధాన్యంపై రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2320, సాధారణ రకానికి క్వింటాల్‌కు రూ.2300 ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందన్నారు. తూకంలో, బిల్లులు చెల్లింపులో జాప్యం చేసినా చర్య లు తప్పవని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రూరల్ మండల పార్టీ అధ్యక్షుడు నవీన్ గౌడ్, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు వెంకట్ నర్సింహారెడ్డి, రాంరెడ్డి, బాలవర్ధన్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, విండో సీఈఓ రత్నయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రులకు ఆహ్వానం



మంత్రి శ్రీధర్ బాబును కలిసిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరు కావాలని రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డిలను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అసెంబ్లీ ప్రాంగణంలో వారిని కలిసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌యాదవ్‌ను మంత్రులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి



మొగులయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

స్టేషన్ మహబూబ్‌నగర్/హన్వాడ: మండలంలోని శేక్‌పల్లి గ్రామ బీఆర్‌ఎస్ కార్యకర్త మొగులయ్య కుటుంబాన్ని మంగళవారం మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. మొగులయ్య భార్య ఇటీవల మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మండల నాయకులతో కలిసి శేక్‌పల్లికి వెళ్లి మొగులయ్యను పరామర్శించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ఎఫ్‌ఏ సీఎస్ చైర్మన్ వెంకటయ్య, మాజీ వైస్ చైర్మన్ శ్రీను, మాజీ సర్పంచ్ శ్రీదేవి, మాజీ ఎంపీటీసీ రాఘవులు, తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి..

బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు ఎక్బాల్ మాతృమూర్తి ఇటీవల మృతి చెందారు. జిల్లా కేంద్రంలో ఎక్బాల్‌ను మాజీ హోంమంత్రి మహమూద్‌అలీ, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లు పరామర్శించారు.

డంపింగ్ యార్డు పరిశీలన



డంపింగ్ యార్డును తనిఖీ చేస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిలకొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్ యార్డును మంగళవారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. అక్కడ జరుగుతున్న సెగ్రిగేషన్ పనులతో పాటు అప్రోచ్ రోడ్డు కోసం స్థలాన్ని పరిశీలించారు. కొన్ని నెలలుగా డీఆర్‌సీసీ మీదుగా భూత్పూర్–చించోళి జాతీయ రహదారి పనులు కొనసాగుతున్న విషయం విధితమే. దీంతో అప్రోచ్ రోడ్డు లేక ఆటోలు, ఇతర వాహనాలు డంపింగ్ యార్డు లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అనంతరం మెట్టుగడ్డ చౌరస్తా నుంచి పిల్లలమర్రి రోడ్డులోని రైల్వేగేట్ వరకు రహదారికి ఇరువైపులా నాటిన మొక్కలను పరిశీలించారు. పలుచోట్ల ఎండిపోయిన మొక్కలను తొలగించి కొత్తవి నాటాలని మున్సిపల్ సిబ్బందికి సూచించారు.

సీసీరోడ్డు పనులకు భూమి పూజ



చిన్నచింతకుంట: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి మంగళవారం అధికారులు, కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ దేవరకద్ర నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు ఎస్ వెంకటేష్ మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహిమూద్, ఎస్ శేఖర్, దామోదర్, జేరాజ్, తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాల తనిఖీ



దేవరకద్ర: మండల కేంద్రంలోని వెంకటసాయి విద్యానికేతన్, సీవీ రామన్, తపోవన్ హైస్కూళ్లను మంగళవారం ఎంఈఓ బలరాం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్‌ఏ– 1 పరీక్షలను ఆయన పరిశీలించారు. డీసీఈబీ నుంచి వచ్చిన ప్రశ్నాపత్రాలను ఉపయోగించాలని ఆయా పాఠశాలల నిర్వాహకులకు తెలిపారు. డీసీఈబీ ప్రశ్నాపత్రాలను వినియోగించకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరించారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో షీ టీం ఆధ్వర్యంలో చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక అవగాహన పెంచుకోవాలని, చట్ట వ్యతిరేక అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. అధ్యాపకులు నర్సింహులు, షీ టీం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్రా యాత్రికుడికి సన్మానం


స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర మక్కా, మదీనా షరీఫ్ ఉమ్రాయాత్రకు వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ పట్టణ మైనార్టీ విభాగం అధ్యక్షులు గులాం మహ్మద్ జహీర్‌ను ఆయన స్వగృహంలో మంగళవారం రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ పూలమాలలు, మహెరుమాతో ఘనంగా సత్కరించారు. బెక్కరి మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షులు లింగంనాయక్ ఉన్నారు.

మార్కెట్ కమిటీ పాలకవర్గం నియామకం

నవాబుపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన మార్క్‌ను చూపించి మండలంలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్‌లకు కట్టబెట్టి తన ప్రత్యేకతను చాటారు. గతంలో ఎన్నడూ చైర్మన్ పదవి దక్కని మెజార్టీ వర్గానికి మార్కెట్ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. ఎన్నికల్లో గెలుపోటములకు ముఖ్య భూమిక పోషిస్తున్న గిరిజనులకు వైస్ చైర్మన్ పదవిని అప్పగించారు. దీంతో పాటు మూడు గ్రామాలకు ఒకటి చొప్పున 12 మంది మార్కెట్ డైరెక్టర్లను నియమించారు. దీన్ని మంగళవారం అధికారికంగా ప్రకటించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు పొమాల్ గ్రామానికి చెందిన లింగంను నియమించారు. వైస్ చైర్మన్‌గా ఎస్‌టీ వర్గానికి చెందిన మాజీ ఎంపీటీసీ కొల్లూర్ గ్రామం సత్రోనిపల్లితండాకు చెందిన తులసీరాం నాయక్‌ను నియమించారు. దీంతో పాటు మార్కెట్ డైరెక్టర్లుగా నవాబుపేటకు చెందిన చెక్కల కుమార్, లోకిరేవు గ్రామానికి చెందిన నరేష్, జంగమయ్యపల్లికి చెందిన పద్మమ్మ, ఆర్‌సీపూర్‌కు చెందిన శంకర్‌నాయక్, కొండాపూర్ పురుషోత్తంరెడ్డి, యన్మన్‌గండ్ల జమీర్, గొల్లవెంకటయ్య, కామారం కోస్గీ ప్రభాకర్, లాలయ్య, నర్సింహులు, వ్యాపారుల నుంచి రొక్కం రాఘవేందర్, చంద్రకాంత్‌లను నియమించారు. పాలకవర్గం త్వరలో పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.



మార్కెట్ కమిటీ చైర్మన్ లింగం



వైస్ చైర్మన్ తులసీరాంనాయక్

భూములు లాక్కోవాలని చూసింది బీఆర్‌ఎస్సే

జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి



నందిగామలో బొడ్రాయి ప్రతిష్ఠ సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానిస్తున్న గ్రామస్తులు

రాజాపూర్: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన భూములను లాక్కోవాలని చూసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టాలిస్తామని హామీ ఇచ్చిందని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి పంచాయతీ పరిధిలోని నందిగామ గ్రామంలో నిర్వహించిన బొడ్రాయి, పోచమ్మ, నాగుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. గ్రామంలో తమ నాయనమ్మ ఇచ్చిన భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కోవాలని చూస్తే తాను ఆందోళన చేసినట్లు గుర్తు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం లాక్కోవాలని చూస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం వారికి పట్టాలిస్తామని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కగారు హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటయ్య, నాయకులు నరహరి, యాదయ్య, విక్రంరెడ్డి, శేఖర్‌గౌడ్, శేఖర్‌రెడ్డి, శ్రీనివాస్,రఘు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



ఏఈకి ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

జడ్చర్ల: జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో కొన్ని రోజులుగా తాగునీటి సరఫరాకు సంబంధించి అనేక సమస్యలు నెలకొన్నాయని, వెంటనే వాటిని పరిష్కరించాలని కోరుతూ మంగళవారం మున్సిపాలిటీ ఇన్‌చార్జి చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్లు మిషన్‌భగీరథ కార్యాలయంలో ఏఈ మొగులప్పకు వినతి పత్రం అందజేశారు. జడ్చర్ల మున్సిపాలిటీ జనాభాకు అనుగుణంగా తాగునీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న 10 ఎంఎల్‌డీ నీరు ఎంతమాత్రం సరిపోవడం లేదని, 12 ఎంఎల్‌డీ నీరు ప్రతి రోజు సరఫరా అయ్యే విధంగా చూడాలని కోరారు. ఇప్పటికే చాలా కాలనీలలో తాగునీటి సమస్యను ప్రజలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొన్ని కాలనీలలో ట్యాంకర్ల ద్వారా తాగు నీటి సరఫరా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నందకిషోర్‌గౌడ్, ప్రశాంత్‌రెడ్డి, పుష్పలత, శశికిరణ్, లత, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశ ఐక్యతను చాటిన సమరయోధులు



సమావేశంలో మాట్లాడుతున్న అబ్దుల్ హాదీ

స్టేషన్ మహబూబ్‌నగర్: దేశం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులు దేశ ఐక్యతను చాటి చెప్పారని, అలాంటి వారిలో రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాకుల్లాఖాన్ ముందు వరుసలో ఉంటారని పలువురు సామాజిక, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్‌క్రాస్ భవన్‌లో మంగళవారం మిల్లి మహజ్ మహబూబ్‌నగర్ ఆధ్వర్యంలో అష్ఫాకుల్లాఖాన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ రాంప్రసాద్ బిస్మిల్, అష్ఫాకుల్లాఖాన్‌ల స్నేహం భారత స్వాతంత్ర్య పోరాటంలో ఒక కొత్త మలుపు తీసుకొచ్చిందన్నారు. దేశంలో విద్వేషం పెరుగుతున్న సమయంలో జాతీయ సమైక్యత కోసం ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో మిల్లి మహజ్ చీఫ్ ప్యాట్రన్ ఖాజా ఫయాజుద్దీన్ అన్వర్‌పాషా, కన్వీనర్లు తఖీ హుస్సేన్, ఖుద్దూస్‌బేగ్, జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్, అడ్వకేట్ కృష్ణ, ఎంఐఎం నాయకులు అబ్దుల్ హాదీ, మక్బూద్ బిన్ అహ్మద్ జాకీర్ అడ్వకేట్ తోపాటు పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



నూతన కార్యవర్గంతో రాష్ట్ర ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీజీఎస్‌ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రతినిధులు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్లో మంగళవారం సంక్షేమ సంఘం జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్, కృష్ణ, చైర్మన్ రాజయ్య నాయక్ హాజరయ్యారు. ఉద్యోగుల సమస్యలు ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా అచ్చంపేట డిపోకు చెందిన వెంకటయ్య, ప్రధాన కార్యదర్శిగా కల్వకుర్తి డిపోకు చెందిన కండక్టర్ దార సుందర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా మున్సిపల్ కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర, జోనల్, రీజినల్ ప్రతినిధులు, డిపో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మత్స్య కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



తిర్మలాపురం గ్రామ చెరువులో చేప పిల్లలను వదులుతున్న మత్స్యకార్మికులు

చిన్నచింతకుంట: మత్స్య కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని అప్పంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం అధ్యక్షులు సురేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాపురం గ్రామ చెరువులో ప్రభుత్వం అందించిన చేప పిల్లలను మత్స్యకారులతో కలిసి వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్య కార్మికుల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ సత్యన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంమోహన్‌రెడ్డి, మత్స్య కార్మికులు రాంచంద్రయ్య, బాలు చందర్, రవి, తదితరులు ఉన్నారు.


వచ్చే నెల మండలానికి జాతీయ బృందం



తీగలపల్లి సెగ్రిగేషన్‌షెడ్డు(ఫైల్)

నవాబుపేట: గ్రామాల్లో కొనసాగుతున్న జాతీయ ఉపాధి హామీ పథకం పనులు పరిశీలించేందుకు జాతీయ బృందం వచ్చే నెల మండలంలో పర్యటించనున్నట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. మంగళవారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో మాట్లాడుతూ వచ్చే నెల 4వ తేదీ నుంచి 11వ తేదీ వరకు ప్రత్యేక జాతీయ బృందం పర్యటిస్తుందన్నారు. మండలంలో 54 గ్రామాల్లో 5 గ్రామాలను కమిటీ ఎంపిక చేసిందన్నారు. జిల్లా మొత్తం దాదాపుగా పదికి పైగా గ్రామాలను ఎంపిక చేయగా, వాటిలో 5 గ్రామాలు కేశవరావుపల్లి, తిమ్మయ్యపల్లి, తీగలపల్లి, దయపంతులపల్లి, పల్లెగడ్డ ఎంపిక చేసిందని తెలిపారు. ప్రధానంగా ఉపాధి పనిలో చేపట్టిన పనులు, గ్రామాలకు ప్రత్యేకంగా గతంలో చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్లు, శ్మశాన వాటికలను బృందం పరిశీలించే అవకాశం ఉందన్నారు.

అసంపూర్తి పనులతో అవస్థలు



అసంపూర్తిగా మిగిలిన రోడ్డు పనులు

అడ్డాకుల: మూసాపేట మండలంలోని 44వ జాతీయ రహదారి నుంచి వేముల మీదుగా రాయచూర్ రోడ్డు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు పనులు అసంపూర్తిగా మిగిలాయి. 2017లో డబుల్ రోడ్డు పనులకు ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.17కోట్లు మంజూరు కాగా, అప్పటి మంత్రి కేటీఆర్ పనులను ప్రారంభించారు. ఇప్పటి వరకు రోడ్డు పనులు పూర్తి కాలేదు. వేములకు వెళ్లే దారిలో చందమామ బావి వద్ద రోడ్డు పనులు పూర్తి చేయకపోవడంతో రోడ్డంతా గుంతలమయంగా మారింది. గ్రామంలోని వాటర్ ట్యాంకు నుంచి ఊరి చివరి వరకు కంకర వేసి వదిలేయడంతో దుమ్ముతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 17.3 కిలోమీటర్ల దూరం రోడ్డు పనులు చేయాల్సి ఉండగా, కేవలం 5 కిలోమీటర్లు పనులు చేసి వదిలేయడంతో ఈ రోడ్డుపై వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు